
తెలుగు దినపత్రిక
# సిద్ధిపేట పవర్
ప్రతిక్షణం ప్రజల పక్షం

విలేకరులు కావలెను
తెలుగు రాష్ట్రాల నుండి విడుదలవుతున్న
సంచలన సమాచార దినపత్రిక 'సిద్ధిపేట పవర్' తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్ లు ఆర్సి ఇంచార్జ్ లు కావలెను
ఆసక్తి ఉన్నవారు వెంటనే సంప్రదించండి
ఫోన్: 9866338848
www.siddipetpower.com

సోమవారం | 10-03-2025 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు | సంపుటి 01 | సంచిక 50 | వెల : 06 రూ

# కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న మంత్రి పొన్నం



సిద్ధిపేట పవర్ దినపత్రిక: చేర్యాల : కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో జీవనం సాగించాలని తాను కొరుకున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారిని మంత్రి పొన్నం కుటుంబ సభ్యులతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహామండపంలో పట్నం



వేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి క్షేత్రంలోని గెస్ట్‌హౌజ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు స్వామి వారిని దర్శించుకున్నానని, ఇప్పుడు కుటుంబ సభ్యులతో వచ్చిన స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లిం చుకున్నట్లు తెలిపారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో తెలంగాణ సస్యశ్యామలం కావాలని మల్లన్నను వేడుకున్నట్లు తెలిపారు.

## ఎస్ఎల్బీసీ టన్నెల్ నుంచి ఎట్టకేలకు
# ఒక మృతదేహం వెలికితీత

- గత నెల 22న ఎస్ఎల్బీసీ టన్నెల్ వద్ద ప్రమాదం
- 16 రోజులుగా కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్



ప్రమాదం జరిగిన 16 రోజులకు ఎట్టకేలకు ఎస్ఎల్బీసీ టన్నెల్ నుంచి ఒక మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహం బాగా కుళ్లిపోయి నుజ్జునుజ్జయిన స్థితిలో ఉంది. ఆ మృతదేహం టన్నెల్ బోరింగ్ మెషీన్ ఆపరేటర్ గురుప్రీత్ సింగ్ ది అని భావిస్తున్నారు. అయితే, అతడి కుటుంబ సభ్యులు గుర్తించిన తర్వాత ఓ నిర్ధారణకు రానున్నారు. కాగా, మృతుడి కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షలు అందించనున్నట్టు తెలుస్తోంది. టన్నెల్ నుంచి వెలికితీసిన మృతదేహాన్ని నాగర్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టన్నెల్ ప్రమాదంలో మొత్తం 8 మంది గల్లంతైన సంగతి తెలిసిందే.

# అసాధారణ ఆట... అసాధారణ ఫలితం...




దుబాయ్ లో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో టీమిండియా విజయం సాధించడంతో యావత్ భారవతాని పులకించిపోయింది. వన్డే ఫార్మాట్ లో నిర్వహించిన ఈ టోర్నీలో టీమిండియా ఛాంపియన్ గా అవతరించింది. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఒక అసాధారణ ఆట. ఒక అసాధారణ ఫలితం అంటూ టీమిండియా గెలుపును కీర్తించారు. "ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని ఇంటికి తీసుకువస్తున్న మన క్రికెట్ టీమ్ ప్రదర్శన పట్ల గర్విస్తున్నాను. టోర్నీ ఆసాంతం అద్భుతంగా ఆడారు. అమోఘమైన ఆల్ రౌండ్ షోతో అలరించిన మన జట్టుకు శుభాభినందనలు" అంటూ మోదీ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

## మహిళా దినోత్సవ సభలో
# రేవంత్ చెప్పినవన్నీ అబద్ధాలే

- పరేడ్ గ్రౌండ్ సాక్షిగా రేవంత్ అబద్ధాలు చెప్పారన్న హరీశ్ రావు
- మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్లు ఇచ్చి ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్
- సీఎం, డిప్యూటీ సీఎం గోబెల్స్ ప్రచారంలో ఆరితేరిపోయారని విమర్శలు




మహిళా దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి చెప్పినవన్నీ అబద్ధాలేనని బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు ధ్వజమెత్తారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పారని... అబద్ధానికి ప్యాంట్, షర్టు వేస్తే రేవంత్ రెడ్డిలా ఉంటుందని విమర్శించారు. మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇచ్చామన్నారని... ఆ రుణాలు ఎలా ఇచ్చారో చెప్పాలని నిలదీశారు. ఒకవేళ రూ.21 వేల కోట్ల రుణాలు నిజంగానే ఇచ్చి ఉంటే ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రికి తోడు డిప్యూటీ సీఎం (మల్లు భట్టి విక్రమార్క) కూడా గోబెల్స్ ప్రచారంలో ఆరితేరారని విమర్శించారు. కేసీఆర్ ఇచ్చిందే ఇస్తూ.రూ.21 వేల వడ్డీ లేని రుణం అని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలను కాంగ్రెస్ సర్కారు మరింత మోసం చేస్తోందని, ఇచ్చే రూ.5 లక్షల వడ్డీ లేని రుణం కూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని ఆరోపించారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చింది గుండు సున్నా అని, కాంగ్రెస్ ప్రచారం అంతా బోగస్, డొల్ల అని హరీశ్ రావు విమర్శించారు. నిన్న మీ అబద్ధాలు వినలేక సభ నుంచి మహిళలు వెళ్లిపోయారని వెల్లడించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి అబద్ధాలు చెప్పడం మానుకోవాలని హితవు పలికారు.

# తప్పు ఎక్కడ జరిగిందో
## నిరూపించమంటే ఎవరూ రావడంలేదు: సీఎం

- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో పద్మశాలి మహాసభ
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- కులగణనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం



హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన పద్మశాలి మహాసభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, కులగణనతో బీసీలకు న్యాయం చేయాలన్నది రాహుల్ గాంధీ ఆశయం అని, తెలంగాణ వ్యాప్తంగా పకడ్బందీగా కులగణన చేశామని స్పష్టం చేశారు. కులగణన నచ్చనివారే సర్వేపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కులగణనలో తప్పు ఎక్కడ జరిగిందో నిరూపించమంటే ఎవరూ రావడంలేదని విమర్శించారు. తప్పుడు ప్రచారం చేస్తూ, బలహీన వర్గాల హక్కులను కాలరాయాలని చూస్తున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీది కీలకపాత్ర అని వెల్లడించారు. ఉద్యమం కోసం ఆయన ఎన్నో త్యాగాలు చేశారని తెలిపారు. నీడ లేని వాళ్లకు తన ఇల్లు ఇచ్చారని వివరించారు. అలాంటి మహనీయుడిని, తెలంగాణ వచ్చాక పట్టించుకోవడం లేదని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చనిపోతే మాజీ సీఎం వెళ్లలేదని పరోక్షంగా కేసీఆర్ పై విమర్శలు చేశారు. ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెడతామని ప్రకటించారు. తమ ప్రభుత్వంలో రైతులతో పాటు నేతన్నలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల్లోని స్త్రీలకు రెండు చీరల చొప్పు ఇస్తామని వెల్లడించారు. నేతన్నలకు రూ.1.30 కోట్ల చీరలు నేసే ఆర్డర్లు ఇస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రముఖ వ్యాపార వేత్త మృతి చాలా బాధాకరం..



సిద్ధిపేట పవర్ దినపత్రిక: సిద్ధిపేట కు చెందిన ప్రముఖ వ్యాపార వేత్త, ఆధ్యాత్మిక, సామాజిక సేవా నిరతుడు గట్టు రవీందర్ రోడ్డు ప్రమాదం లో మృతి చెందడం చాలా బాధాకరం.. రవీందర్ గారి మృతి దిగ్భ్రాంతి కి గురించేసింది. రవీందర్ తో చాలా ఏళ్లుగా అనుబంధం ఉంది.. సిద్ధిపేట లో వ్యాపార వేత్త గా నే కాకుండా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో గట్టు రవిగారు ఎల్లప్పుడూ ముందు ఉండే వారు.. ఎవరికి ఏ సహాయం అవసరం ఉన్నా సహాయం చేసే వాడు.. చనిపోయే చివరి నిమిషం వరకు కూడా ఆయన సేవా కార్యక్రమాల్లో ఉన్నారు నిన్న రాత్రి 9 గంటల ప్రాంతం లో ఆయనను కలవడం జరిగింది చర్చల్లో ఎవరైనా చనిపోయినప్పుడు ఫ్రీజర్లు అవసరం అయినన్ని లేకపోవడం తో గ్రామీణ ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్నారని ఇంకో ఫ్రీజర్ ఏర్పాటు చేస్తేబాగుంటుంది అని రవీందర్ గారికి తెలిపినప్పుడు వెంటనే స్పందించి తాను తన మిత్రులు కలిసి ఫ్రీజర్ ఇప్పిస్తామని చెప్పాడు. రోడ్డు ప్రమాదాల గురించి కూడా చర్చ జరిగింది.. సిద్ధిపేట కు చెందిన చాలా మంది ప్రముఖులు కార్లు ఉన్నా ద్విచక్ర వాహనాలపై కుటుంబాలతో కలిసి వెళ్తున్నారని ఇది మంచిది కాదని కార్లు ఉన్నవారు కార్లల్లో వెళ్లడం మంచిదని... రాంగ్ రూట్ లేలోవచ్చే వారివల్ల ప్రమాదాలు పొంచి ఉన్నాయని కూడా రవీందర్ గారితో తెలపడం జరిగింది.. తాము కలిసి చర్చించిన గంట సేపటికే గట్టు రవీందర్ గారు రోడ్డు ప్రమాదం లో మరణించిన వార్త తెలిసి చాలా బాధ కలిగింది.. రాంగ్ రూట్ లో వచ్చిన వ్యక్తి రవీందర్ గారి బైక్ ను ఢీకొట్టడం వల్ల ఈ ప్రమాదం జరగడం విషాదం. ఆయన కారులో వెళ్లి ఉంటే మరణం సంభవించి ఉండేది కాదు.. నేను సిద్ధిపేట లోని ప్రముఖులకు విజ్ఞప్తి చేస్తున్నా కార్లు ఉన్నవారు బైక్ లపై ప్రయాణం చేయకండి.. కార్లు లేనివారు బైక్ ల పై వెళ్ళినప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ లను ధరించండి.. రాంగ్ రూట్ లలో వెళ్ళకండి... అతి వేగంగా బైక్ లనునడిపి ఇతరుల ప్రాణాలు తీయకండి.. మీ విలువైన ప్రాణాలు పోగొట్టుకోకండి అని విజ్ఞప్తి చేస్తున్న.. ఆత్మీయ మిత్రుడు గట్టు రవి గారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా..

# తపస్పల్లి రిజర్వాయర్ నీళ్లు లేక పంటలు ఎండి పోతున్న వేళ

## పంట పొలాలకి నీళ్లు ఇవ్వలేని మీ పాలన రైతన్నల నీళ్ల గోస ఉద్యమం :



సిద్ధిపేట పవర్ దినపత్రిక: ఎక్కడికి అక్కడ ఎండి పోతున్న మా పంట పొలాలకి నీళ్లు విడుదల చేయపోతే కొమురవెల్లి నుంచే రైతన్నల నీళ్ల గోస ఉద్యమం మొదలు అంటున్న కొమురవెల్లి భాజపా సీనియర్ నాయకులు కొయ్యడ నవీన్ గౌడ్ అన్నారు మాటల తూటాలని దొంగ మాటలు చెప్పి కోట గోడలెక్కి.. పాలనతో పరువు తీస్కుంటున్న ఓ కాంగ్రెస్ ప్రభుత్వమా.. పేద ప్రజలకై మాట్లాడిన నీ వాక్చతుర్యం సోమ్మసిలిందా సంవత్సర పాలనలోనే ప్రజల్లో మీ మీద ప్రజల విశ్వాసం అట్టడుగు పోయింది.. పంట పొలాలకి నీళ్లు ఇవ్వలేని మీ పాలన ప్రజా అగ్రహారం గురి కాక తప్పదు..స్థానిక జనగామ నియోజకవర్గంలోని కొమురవెల్లి మండల తపస్పల్లి రిజర్వాయర్ నీళ్లు లేక పంటలు ఎండి పోతున్న వేళ మీ కాంగ్రెస్ నాయకుల కంట కనబడటం లేదా.. మా రైతన్నల గోడు వినబడ్తలేదా......ఆకాశంలో చుక్కలు చూపెట్టి అద్దాల మేడేక్కుతున్న ఎమ్మెల్యే అయినా పల్లా రాజేశ్వర్ రెడ్డి గారికి రైతన్న గోస కనిపిస్తలేదా మా రైతన్నల గోడు ...ఖబర్ధార్ కాంగ్రెస్ సర్కార్ వెంటనే మా నియోజకవర్గానికి దేవాదుల నీళ్లు విడుదల చేయకపోతే అన్నదాతలతో కలిసి పెద్ద ఎత్తున కొమురవెల్లి మల్లన్న సాక్షిగా రైతు కోసం.

# ఊహాలు

ఊహాలు ఆకలితో ఉండే కడుపులు
ఒక పూట నిండితే చాలదు
మరో పూట మరో ఊహ ఎదురుచూపులే
ఊహాలకు రెక్కలు వస్తే ఎగరడం నేరుస్తాయి
మరికొందరికి పంచి ఎగరడం నేర్పిస్తాయి

ఊహాలు గుసగుసలాడుతాయి
మనసును ఉయ్యాలలూపుతాయి
కొన్నిసార్లు చెట్టెక్కిస్తాయి, చేతులు విడిచేస్తాయి
ప్రేమ ఊసులు పంచుతాయి
ప్రేమించడం నేర్పిస్తాయి
చిగురించడం, విస్తరించడం నేర్చి విశ్వవ్యాప్తమవుతాయి
ప్రేయసి ప్రియుల ఊహాలు పందిరిలేస్తే
మూడో ప్రపంచం అంబాడుతది

ఏదైనా పరిశోధన ఫలవంతానికి ముందు
ఊహ ఉగ్గుపాలు తాగాల్సిందే
ఊహా ప్రపంచం లేకపోతే
ముందుకు పడదు ప్రగతి అడుగు
ఆటవికం నుంచి ఆధునిక జీవితం వరకు
ఎన్నెన్ని ఊహాలు చెమటోడ్చి పదునెక్కాయో
అద్భుతాలు సృష్టించి అలరించాయో
అక్షరాలు పదాలు వాక్యాలై అర్థవంతం కావడానికి
ఎన్ని ఊహాలు ఘర్షణ పడతాయో

కొన్ని ఊహాలు చిగురుటాకులోనే రాలిపోతాయి
నచ్చని, నప్పని వాక్యాలు కొట్టివేతలు
మార్చుకోవడానికి సౌలభ్యం రాతల్లో
శిల్పకారుని ఊహాల చేతి నైపుణ్యంలో
మార్పులుండవు, మరమ్మతులుండవు
పదునెక్కిన ఉలి దాటొద్దు పరిమితులు
సామాజిక హద్దులు దాటిన ఊహాలు
మేలు కంటే చేస్తాయెక్కువ కీడు



కొమురవెల్లి అంజయ్య
సీనియర్ జర్నలిస్ట్
సిద్దిపేట

# రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు బాలలక్ష్మీని కలిసిన టిఎస్ బిబిఎస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు



సిద్ధిపేట పవర్ దినపత్రిక: బీసీ కులాలకు మెరుగైన జీవితాన్ని అందించడం కోసమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కులగణన సర్వే నిర్వహించారని తెలిపారు రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు బాలలక్ష్మి. ఆదివారం సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండలం పరిధిలోని కొండాపూర్ గ్రామంలో ఓ గృహప్రవేశ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు బాలలక్ష్మిని గౌరవపూర్వకంగా కలిశారు తెలంగాణ రాష్ట్ర బీసీ బహుజన సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు సింగోజు మురళీకృష్ణ ఆచార్యులు. ఈ సందర్భంగా కమీషన్ సభ్యులు బాలలక్ష్మీతో ఉద్యమకాలం నాటి నుండి నేటి వరకు బీసీల స్థితిగతులపై చర్చించారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో జరిగిన బిసి కుల గణనపై చర్చించారు. ఈ సందర్భంగా బీసీ కులాలకు,శ్రమనే ఆధారంగా చేసుకుని బతికే వారికి మెరుగైన జీవితాన్ని అందించేందుకు కావాల్సిన చర్యలు తీసుకొనుటకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని బాలలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు వాసురి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# తలాపున సముద్రమ్మంత మల్లన్న సాగర్ ఉన్న చుక్క నీరు రాదు



సిద్ధిపేట పవర్ దినపత్రిక: తొగుట మండలకేంద్రంలో తలాపున సముద్రమ్మంత మల్లన్న సాగర్ ఉన్న మండలకేంద్రంలోని పొలాలకు చుక్క నీరు రాదు యే ప్రాజెక్టు కోసమైతే గ్రామ రైతులు భూములు ఇచ్చారో ఆ ప్రాజెక్టు ద్వారా గ్రామంలో మిగతా భూములకు చుక్క నీరు అందడం లేదు తొగుట చుట్టుపక్కల గ్రామాలకు మల్లన్న సాగర్ నుండి కాలువల ద్వారా అన్ని చెరువులు నింపిన ఇరిగేషన్



అధికారులు తొగుట గ్రామానికి మాత్రం సాగునీరు తీసుకురాకపోవడం చాలా బాధాకరం మల్లన్న సాగర్ ద్వారా సాగునీరు వస్తదని ఎదురుచూసిన తొగుట గ్రామ రైతుల ఆశలు అవిరైతున్నాయి ఇప్పటికే గ్రామంలో పద్దులకొద్ది ఎకరాలల్లో వరి నిరులేక ఎండిపోతున్నది ఇప్పటికైనా గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు అందరు ఆలోచన చేయండి మన గ్రామ రైతుల కష్టాలు తీర్చడంలో మీ పాత్రను పోషించాలని విజ్ఞప్తి.

# ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేసిన కాంగ్రెస్...

- తెలంగాణలో ఖాళీ కానున్న ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలు
- ఒకటి స్థానం బీఆర్ఎస్ పరం!



తెలంగాణలో ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. త్వరలో ఖాళీ కాబోతున్న ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక కోసం కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తులు ఓ కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. తాజాగా ముగ్గురు ఎమ్మెల్సీ అభ్యర్థులతో కాంగ్రెస్ అధిష్ఠానం నేడు జాబితా విడుదల చేసింది. ఇందులో నటి, మాజీ ఎంపీ విజయశాంతి పేరు కూడా ఉంది. విజయశాంతితో పాటు అద్దంకి దయాకర్, శంకర్ నాయక్ లను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పేర్కొంది. కాగా, ఖాళీ కానున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బీఆర్ఎస్ కు దక్కనుండగా... నాలుగు కాంగ్రెస్ కు లభించనున్నాయి. ఈ నేపథ్యంలో, ముగ్గురితో జాబితా ప్రకటించిన ఏఐసీసీ... నాలుగో స్థానాన్ని మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు మార్చి 20న పోలింగ్ జరగనుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్

బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ పేరు ఖరారైంది. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. రేపు ఉదయం దాసోజు శ్రవణ్ నామినేషన్ వేయనున్నారు. నామినేషన్ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను ఆదేశించారు.

